జాగృతి వారపత్రిక (8.11.61)
దీపావళి కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

మేలుకొలుపు

రాత్రి పన్నెండు గంటలయింది! లోకం నిద్రపోతోంది.

హోరున వర్షం కురుస్తూ ప్రకృతిని భీభత్సం చేస్తున్న సమయంలో ఆ భవనం నుంచి బయటకు పరుగుదీశాను. గుండెలకంటే వేగంగా కాళ్ళు దడదడలాడుతున్నాయి. కాళ్ళ నెవరో బలంగా లాగుతున్నట్లుగా అడుగువేయటానికే ఆయాసం ముంచేస్తోంది. దేహంలోని

శక్తినంతటినీ కూడదీసుకొని పరిగెత్తుతున్నాను.

"దొంగ! దొంగ!....." వెనకాల కేకలు. పోలీసు విజిల్సు......

సాధ్యమైనంతవరకు తారాజువ్వలా దూసుకుపోతున్నాను. మెయిన్‌రోడ్డు వదలి చిన్న చిన్న సందుల వెంట అడ్డదిడ్డంగా పరిగెత్తాను. శివాలయం వీధి దాటుతున్నప్పుడే ప్రక్కనే వున్న తోటలో స్వామీజీ ఆశ్రమం గుర్తుకు వచ్చింది. ఎక్కడ లేని శక్తి నన్నావరించుకుని ఆ తోటలోకి నడిపించింది. ఇప్పుడాపత్సమయంలో ఆశ్రయం ఇవ్వగలిగింది స్వామీజీ ఆశ్రమమొక్కటే అనిపించి అటే పరుగుదీశాను.

స్వామీజీ కుటీరంలోకి వెళ్ళాను. నా బట్టలు పూర్తిగా తడిసిపోయాయి. ఆయాసం తీర్చుకుంటూ పంచలో నిలబడ్డాను..... కుటీరం తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. స్వామీజీ లోపల పడుకున్నారు కాబోలు! తలుపు సందుగుండా సన్నని దీపపుకాంతి రెపరెపలాడుతున్నా బయటకు ప్రసరిస్తోంది.

దూరంగా వినవస్తున్న పోలీసు విజిల్సు అంతకంతకు దగ్గరౌతున్నాయి. నన్ను నిలువునా భయం చుట్టేసింది.... ఇదివరకొకసారి ఖూనీకోరిట్లాగే తప్పించుకుపోతే స్వామీజీ ఆశ్రమంలో పట్టుకున్నారు పోలీసులు. బహుశ వాళ్ళిప్పుడిటే రావచ్చు. ఏం చేయాలి? అప్పుడు బయటకు పోదామంటే మార్గమొక్కటే వుంది. అక్కడ తప్పకుండ పట్టుపడిపోతాను. ఇక తోటలో చెట్లలోకి దూరి ఆత్మరక్షణ చేసుకోవాలనుకుంటున్నాను. ఇంతలో "ఎవరయ్యా నీవు!" అన్న స్వామీజీ గొంతు వినిపించి నాలో నవ చైతన్యం కల్గించింది. నేను వెనుదిరిగే లోపల చేత దీపంతో స్వామీజీ బయటకు వచ్చారు.

"నన్ను కాపాడండి స్వామీజీ! పోలీసులు తరుముతున్నారు. నేనేం తప్పు చేయలేదు...." అన్నాను గాద్గదికంగా. నా కళ్ళల్లో నీళ్ళుబికి వర్షపు నీటితో కలిసిపోయాయి.

స్వామీజీ ఒక క్షణం అన్యమనస్కంగా ఉండిపోయారు. పోలీసుల విజిల్సు చాలా దగ్గరగా వినవస్తున్నాయి. నాలో కంగారు ఎక్కువైంది.

"సరే! లోపలికి వెళ్ళు. కదలకుండ తడిక చాటున కూర్చో!" అన్నారు స్వామీజీ.

నాకు పోతున్న ప్రాణం నిలబెట్టినట్లయింది. కుటీరం లోపలికి వెళ్ళి లోపలగా తడిక చాటున కూర్చుండిపోయాను. ఇద్దరు శిష్యులు మాత్రం ముందుగదిలో ఒడలు మఱచి నిద్రపోతున్నారు. పోలీసుల సవ్వడి వినిపిస్తుందేమోనని చెవులు నిక్కించి వింటున్నాను.

కిరీటినం గదినం చక్రహస్త
మిచ్ఛామిత్వాం, ద్రష్టు మహంతథైవ।
తేనైవ రూపేణ చతుర్భుజేన
సహస్ర బాహోభవ విశ్వమూర్తే॥

స్వామీజీ కోమల కంఠంలోంచి భక్తిరసం జాలువారుతోంది. ఎప్పుడూ తలచుకోని ఆ భగవంతుడు ఇప్పుడు విశ్వరూప సందర్శనమిచ్చినట్టైంది..... నా ఒడలు గగుర్పొడిచింది.

ఆపద మొక్కులు మొక్కినట్లే అయింది మనస్సు. చలి వల్ల బిగుసుకుపోయిన శరీరం సిగ్గుతో మరీ ముడుచుకుపోయింది.

"ఎవరది?" స్వామీజీ గొంతు వినిపించింది నాకు. పోలీసులు వచ్చి వుంటారు. నా గుండెలు దడదడ కొట్టుకున్నాయి. వాయుస్తంభన చేసినట్లయింది నాకు....

"మేము స్వామీజీ! ఒక ఖూనీకోరు ఇట్లా పారిపోయి వచ్చాడు. మీ ఆశ్రమం వైపు వచ్చినట్లు మా అనుమానం..." అన్నదొక గొంతు. నా తలపై పిడుగుపడినట్లయింది అది. స్వామీజీ నమ్మి నన్ను పోలీసులకప్పగిస్తే! హతాశుడనైపోయాను. క్షణాలు లెక్కపెట్టసాగాను.

"ఖూనీ చేశాడా?" స్వామీజీ గొంతులో ఏ మాత్రం కూడ ఆత్రుత, సందేహం లేవు.

"లేదు ప్రయత్నించాడు. విఫలమైంది. అదృష్టవశాత్తు సమయానికి మేము వచ్చాము. లేకపోతే నిష్కారణంగా చనిపోయేదామె!" అని అతడే అన్నాడు.

"ఆమె ఎవరు?"

"ప్రఖ్యాత నర్తకి సులోచనాదేవి. ఆమె భర్త ఊళ్ళో లేడట. అర్థరాత్రి వేళ యీ ఖూనీకోరు ఆమె భవనంలోకి చొరబడ్డాడు. డబ్బు కోసం బెదరించాడట. ఆ గడబిడ విని దాసీది మాకు ఫోను చేసింది. మేము ఆ ఇల్లు చేరే సరికి పారిపోయాడు. తరుముకుంటూ వచ్చాము. శివాలయం వీధిలో అడుగుపెట్టేవరకు మా కళ్ళముందే పరిగెత్తినవాడు ఇట్టే మాయమయ్యాడు..."

అతడొక్కడే స్వామితో మాట్లాడుతున్నాడు. కాని తక్కినవాళ్ళు కుటీరం చుట్టుప్రక్కల తచ్చాడటం నాకు వినిపిస్తూనే వుంది. నా ప్రాణాలు స్వామీజీ చేతుల్లో ఉన్నాయని అనుకున్నాను.

"ఎక్కడా కనపడలేదోయ్ ఫోర్ నాట్ వన్! తూర్పువీధివైపు పోయాడేమో! పదండి పోదాం.." అని ఒకడన్నాడు. అంతా వీధి గుమ్మం ముందు చేరినట్లున్నారు.

"మేమిక వెడతాం స్వామీజీ! ఎవరైనా ఇటు వస్తే దయచేసి మాకు తెలియజేయండి."

స్వామీజీ తల పంకించారో లేదో నాకు తెలియదు కాని, ఆయన గొంతు వినపడలేదు. ఐదు నిముషాల్లో వాళ్ళ బూట్ల చప్పుడు మాయమైపోయింది.

స్వామీజీ లోపలికి వస్తూ కుటీరం తలుపులు మూయటం చూసి నేను బయటకు వచ్చాను తడిక చాటు నుంచి.... ఆయన ఒక్కక్షణం పాటు నా వైపు తీవ్రంగా చూసి తల పంకించాడు. వారి ముఖంలో ఏదో దివ్యతేజస్సు వెలిగిపోతోంది. నాకు ప్రాణదాతగా అయి దైవమనిపించారు వారు. నా హృదయం భక్తిభావంతో నిండిపోయింది.

"బట్టలు మార్చుకో నాయనా!" అని పొడి అంగవస్త్రాలు ఇచ్చారాయన. నేను నా బట్టలు పిడిచి ఆరవేసుకున్నాను.

వారు కృష్ణాజినంపై కూర్చొని నన్ను చాపపై కూర్చోమన్నారు. అప్పటికి వర్షం తగ్గిపోయింది.

"సులోచనని చంపబోయావని పోలీసు లంటున్నారే! ఏది నిజం?" అని అడిగారు స్వామీజీ.

నేనొక్కక్షణం ఆగి అన్నాను: "స్థూలంగా చూస్తే వారి మాటే నిజం. కాని, దానికి బలవత్తరమైన కారణముంది."

"పొరపాటు. కారణమేదైనా ఒక ప్రాణిని హింసించే అధికారం నీకెవ్వరిచ్చారు?" స్వామీజీ కంఠం తీవ్రమైంది. అయినా నేను జంకలేదు. అప్పటికే తేరుకుని వున్నాను.

"చేసిన ఉపకృతికి కృతఘ్నుత చూపే వ్యక్తికి గుణపాఠం నేర్పవద్దా?"

"దానికి హింస ఆలంబన అనుకుంటున్నావా? వెఱ్ఱివాడా?... అంతటి ప్రతీకారవాంఛ నీలో ఉందంటే ఆ వ్యక్తికి నీవు గొప్ప ఉపకృతియే చేసి యుంటావు. దాని మాట మరచి అవతలివ్యక్తి కృతఘ్నుత చూపారన్న క్రోధంతో నీ హద్దులనే అతిక్రమించావు... దానివల్ల నీవిప్పుడెంత అపాయానికి గురియయ్యావో చూశావా?"

"మీకు సులోచన ఎటువంటిదో తెలియదు స్వామీజీ! తెలిస్తే మీరిట్లా అనరు." అన్నాను ఆవేశంగానే.

ఆయన మందహాసం చేశారు. "సరే! ఎటువంటిదో చెప్పు..."

"కటిక దరిద్రులింట్లో పుట్టిన సులోచనను, ఆమె తల్లిని కాపాడిన నేను నా ఆస్తి పంచుకొని అన్నదమ్ములకు దూరమయ్యాను. దీనావస్థలో వున్న స్త్రీలు కదా అని, సాటివారు కదా అని వారితో సహజీవినై వారిని పోషించాను. అంతకుముందు సులోచన నాట్యం నేర్చుకుంటూ ఉండేదని, తండ్రి మరణంతో ఆర్థిక దుస్థితి వల్ల అది విరమించుకుందని నేను విన్నాను. పదమూడేళ్ళ వయసు పిల్లగా నా పోషణలోకి వచ్చిన సులోచన ఆరేళ్ళల్లో 'నాట్య సరస్వతి' అయింది. ఆమె నాట్యకళ కోసమే నా ఆస్తిని వెచ్చించాను. ఆమె అభివృద్ధి నాకు కీర్తి తెస్తుందని ఎంతో పాటుపడ్డాను. ఆమె తల్లి ఏడాది క్రితం మరణించింది... అయినా, ఆమెను నేను కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చాను. రెండేళ్ళుగా దేశమంతటా చాల ప్రదర్శనలిచ్చి సులోచన పేరు తెచ్చుకుంది. నా ఆశలు పండాయని ఆనందించాను. ఆమె నంతటిదానిని చేశానని ప్రపంచం గుర్తించకపోయినా నేను కించపడలేదు. ఆమె ఇంత ఉన్నతస్థితికి రావటానికి కారణమైన నన్ను కాలదన్ని ఒక ధనవంతుడ్ని పెళ్ళి చేసుకుంది. ఇదేనా కృతజ్ఞత చూపే విధానం? ఆమెను నేను ప్రేమించాను. అంతకు వెయ్యింతలు ఆమెకోసం నా సర్వస్వం త్యాగం చేశాను. బంధువులకు, ఆత్మీయులకు దూరమయ్యాను. కాని, ఒకనాటి ప్రదర్శనానికి వెళ్ళి ఆమె తిరిగి రాలేదు. నాకు జ్వరం వల్ల ఆ ప్రదర్శనానికి వెళ్ళలేదు. ఆమె ప్రదర్శనకు వెళ్ళనంటే నేనే పట్టుపట్టి పంపాను... అదే ఆఖరి కలయికయింది..

"ఆమె నన్ను కూడ ప్రేమిస్తోందనుకునే వాడిని కాని, ధనాశకు లొంగిపోయింది. అయినా ఆమె నన్ను వివాహమాడలేదని నేను బాధపడలేదు. కనీసం తాను చేయబోయే పని గురించి నాతో ఒక్కమాట మాట్లాడలేదు సరికదా పెళ్ళి చేసుకొని కూడ ఒక్కసారయినా నన్ను చూడడానికి రాలేదు. బయట కనిపించినా తల తిప్పుకుపోయేది. అదే నన్ను ప్రతీకారానికి పురికొల్పింది. అప్పటికీ ఈ రాత్రి ఆమెను చంపివేద్దామని ఆమె ఇంటికి వెళ్ళినా ఆమె కాళ్ళపై పడి

ప్రాధేయపడేసరికి నీరైపోయాను. ఇంతకు అదంతా మొసలి కన్నీరని పోలీసు విజిల్సు వినిపించేవరకు నాకు తెలియలేదు. లేకపోతే, ఆమెను దారుణంగా చంపి వుండేవాడిని. పైగా తాను కొంత డబ్బిస్తానని వెళ్ళిపొమ్మని అంది. నాకు అసహ్యమేసింది. వెంటనే వెనుదిరిగాను.. పోలీసులు వచ్చినా నన్ను కాపాడేఉద్దేశ్యం లేదు సరిగదా నన్ను హత్యాప్రయత్నం చేయబోయినందుకు - పట్టివ్వబోయింది. నా అదృష్టం వల్ల మీ చేత రక్షింపబడ్డాను. మీరే చెప్పండి స్వామీజీ! అంతటి నీచురాల్ని చంపి కాకులకు, గ్రద్దలకు వేసినా పాపముంటుందా?" అన్నాను ఆవేశాన్నణుచుకుంటూ.

"స్త్రీని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించదలిస్తే ఆమెను ప్రేమించటం నేర్చుకోవాలి. ఆ పని నీవు చేశావు. అందుకు తగిన ఉపకృతి చేశావు.. ఆమె నీ నుంచి నేర్చుకున్నది 'ధనంతో ఎటువంటి పనియైనా చేయవచ్చు"నని మాత్రమే! మీ ధనంతో ఆమెను కళాసరస్వతిని చేశావు. ఇక నీవశక్తుడవు. ఆమె వేరొక మార్గం అనుసరించిందంటే ఆశ్చర్యమేముంది? అర్థాపేక్ష వున్న వారికి ప్రేమ, కృతజ్ఞత, పాపచింత అనునవి దరికిరావు. ఆమె ధన వ్యామోహం వల్ల నిన్ను దూరం చేసుకుంది. ఎప్పటికైనా ఆ మైకం నుంచి ఆమె తేరుకుంటే పశ్చాత్తాపపడి నీకు క్షమార్పణ చెప్పుకుంటుంది.... నువ్వు ఉద్రేకంలో ఆమెకు నీతి నేర్పబోయి దారుణాన్ని తలపెట్టావు. కాని, ఇంతగా నువ్వామెకై త్యాగం చేసినా ఆమె నీకు దూరమైందన్న స్వార్థగుణం నిన్ను వదలలేదు. అదే లేకపోతే, నీ హృదయం కలుషితమై వుండెడిది కాదు...."

స్వామీజీ మాటలకు నీరైపోయాను. "ఒక వ్యక్తి వున్నతి కోసం జీవిత సౌలభ్యమే త్యాగం చేసిన నేను ఆ స్వార్థానికైనా నోచుకోకూడదా స్వామీజీ!" అన్నాను గాద్గదికంగా.

"నీ ఆవేదన నాకర్థమైంది నాయనా! కాని, నీవా స్వార్థాన్ని కూడా విడనాడి తిరస్కరించిన వ్యక్తినే అధికంగా ప్రేమించగలిగినప్పుడు సార్థక్యం వుంటుంది."

నేనింకేమీ మాట్లాడలేకపోయాను. హృదయం మాత్రం బరువుగావుంది. "ఇక పడుకో! మనస్సు నిర్మలంగా ఉంచుకుంటే కారు మబ్బులవే విడిపోతాయి..." అన్నారు వారు పైకి లేస్తూ.

చాపపై వాలిపోయాను. స్వామీజీ మాటలంతగా రుచించకపోయినా వాటిలో ఏదో నిజముందని మాత్రమనుకున్నాను. వారి మాటల్లోని విశిష్టతే అట్లా అనిపింపజేసింది. పైగా, పోలీసులు కూడా అనుమానించలేనట్లు వ్యవహరించగలిగిన వారి వాక్శుద్ధి నా మనస్సు మత్తేజపరచినట్లయింది... ఏదో విరక్తి భావం నన్ను చుట్టేసింది. ఎప్పుడు నిద్రపట్టిందో నాకు తెలియదు.

అరుణ కిరణాలు కిటికీలోంచి మీద పడగా మేల్కొన్నాను. ఒళ్ళంతా నొప్పులుగా వుంది. గత రాత్రి స్మృతులన్నీ ఒక్కసారి కనుల ముందు మెదిలాయి. పైకి లేచి కూర్చున్నాను.

పూజగదిలో స్వామీజీ ధ్యాన నిమగ్నులై ఉన్నారు. నేను కుటీరం వెలుపలికి వచ్చాను. స్వామీజీ శిష్యులు ఏదో గ్రంథ పఠనం చేస్తున్నారు. నన్ను చూడగానే వారిలో ఒకతను

అన్నాడు "బాబూ! కోనేటిలో ముఖం కడుక్కురండి. ఫలహారం చేద్దురుగాని..."

నేను మౌనంగా కుటీరం దాటి తోటలోపలికి వెళ్ళాను. మచ్చుకొకటి చొప్పున అక్కడ అన్ని రకాల చెట్లూ ఉన్నాయనిపించింది నాకు. పక్షుల కలకలనాదంతో ఆ ప్రదేశమంతా చైతన్యవంతంగా ఉంది. మనస్సు ఆర్ద్రత చెంది కడిగిన వెండిపళ్ళెరం సూర్యరశ్మికి మెరసినట్లుగా వుంది. తోటమధ్యలో ఉన్న కోనేరు చేరుకున్నాను. ఒక ఉత్తరేణి పుల్లతో పళ్ళు తోముకుని ముఖం కడుక్కున్నాను.

ఆ చైతన్య ప్రకృతిని చూస్తూ పావుగంట సేపు నిలబడిపోయాను. ఇక ఆశ్రమం దాటి బయటి ప్రపంచంలోకి వెళ్ళాలనిపించలేదు. స్వామీజీ అనుమతితో ఇక అక్కడనే ఉండిపోవా లనుకున్నాను. గబగబ అడుగులు వేస్తూ కుటీరాన్ని చేరుకున్నాను.

"మా తోట మీ మనస్సు నాకట్టుకున్నట్లుంది. రండి... ఫలహారం చెయ్యండి." అన్నాడొక శిష్యుడు.

"అవును. ఇక్కడ జీవించేవారికి అన్నం, నీళ్ళు అక్కరలేదని ఇప్పుడే తెల్సుకున్నాను... అది సరే, మీ పేరు?" అని అడిగాను.

"విశ్వానంద. అతని పేరు వజ్రానంద... మేము స్వామీజీ ఉపదేశం పొంది నాల్గు సంవత్సరాలైంది. మాకు ప్రపంచమెట్లా మారుతుందో తెలియదు కాని, ఈ ఆశ్రమం, తోట నిత్యనూతనంగా ఉండడం తెలుసు. మేమిప్పుడే ఆత్మసంయమయోగసాధన చేస్తున్నాము... మీ విషయాలు స్వామీజీ చెప్పారు. వారు పూజ నుంచి లేచే లోపల మీరు ఫలహారం చేస్తే తర్వాత మాట్లాడుకోవచ్చు."

నేను చదరపై చతికిలబడ్డాను. విశ్వానందుడొక అరటాకులో అరటిపళ్ళు. బత్తాయి తొనలు, రెండు సీతాఫలాలు ఉంచి నా ముందు పెట్టాడు. నేను మనస్సులో నవ్వుకొని ఇటువంటి ఘడియ నా జీవితంలో వస్తుందని ఎప్పుడూ ఊహించనందు కాశ్చర్యపోయాను.

"మా ఆశ్రమ వాసుల ఉపహారమిదే!" అని నవ్వాడు వజ్రానందుడు.

విశ్వ వజ్రానందులు నా కంటే ఐదారేళ్ళు పెద్ద వాళ్ళయి వుంటారు. వారి జీవనాన్ని నేను కూడా అనుభవించాలనిపించే సరికి ఒళ్ళు గగుర్పొడిచింది. ఫలహారం చేసి పాలు త్రాగిన ఐదు నిముషాలకు స్వామీజీ పూజ ముగించుకొని వచ్చారు. నేను గౌరవంగా లేచి నిలబడి నమస్కరించాను.

"కూర్చో నాయనా!" అన్నారు వారు కృష్ణాజినంపై కూర్చుంటూ. నేను కూర్చున్నాను.

"ఇప్పుడు మనస్సు నిర్మలంగా వుందా?" అని అడిగారు వారు ఆదరపురస్సరంగా.

"తమ ఆశీస్సులవల్ల ఆ నిర్మలత్వం చెడకుండా వుండాలి. జీవితాన్ని మీ శుశ్రూషలోనే గడిపి జన్మ ధన్యతపర్చుకోవాలని వాంఛిస్తున్నాను."

స్వామీజీ మందహాసం చేశారు. "యోగ సాధన సామాన్యవిషయం గాదు నాయనా! మన: క్లేశం వల్ల అది ఎదురుదెబ్బ తీస్తుంది కూడా. అయినా పట్టుమని పాతికేళ్ళు నిండని

నీవు సన్యాసాశ్రమవాసి వవటానికి వలనుపడదు."

"ఎందుచేత? మనోబలాన్ని చేకూర్చుకునే అర్హత కూడలేదా నాకు?" నా కంఠం ఆవేశపూరితమైంది.

"స్థూలంగా చూస్తే లేదనే చెప్పాలి. నీ ఆవేశపూరిత హృదయానికి చిరుతవయస్సులో యోగసాధన అసాధ్యము. వైరాగ్యభావాలతో సుడులు తిరుగుతున్నా నీ మనోసాగరం మా ఆశ్రమ జీవన మందమారుతానికి ప్రశాంతత వహించిందే కాని, నీవు దీర్ఘకాలమిక్కడ ఉండలేవు."

"బయట ప్రపంచంలో మన:శ్శాంతి కరువైన నాకు మీ శుశ్రూష వల్ల నిగ్రహాశక్తి కలుగుతుందనే నా మనస్సు ఘోషిస్తోంది. నా ఈ ప్రస్తుత పరిస్థితికి అన్యచింతవల్ల నైతిక జీవనమే కలుషితమై నేనింకా భ్రష్టుడనైపోవచ్చును కదా! తర్వాత నేను పశ్చాత్తాప పడి మాత్రం ప్రయోజన మేముంటుంది."

స్వామీజీ ఒక్క క్షణం పాటు కళ్ళు మూసుకున్నారు. వెంటనే తెరచి "మనశ్శాంతి కోసం ఇక్కడుండటానికేమీ అభ్యంతరం లేదు.." అన్నారు.

"మరి సాధన మాట...." అని నసిగాను.

ఆయన నవ్వి "జిజ్ఞాసువు అయిన వాడిని విచ్చలవిడిగా పోనిచ్చినా, పూర్తిగా నిర్బంధించినా ప్రమాదమే!... సరే, నా నిబంధనలు చాల కఠినంగా ఉంటాయి సుమా?" అన్నారు.

"అవి నా మనోనిగ్రహాని కాలంబనలు కాకూడదా?" అన్నాను చిన్నగా హసిస్తూ.

"నీ వయస్సుకు మించిన ఉత్తమ సంస్కారం ఉన్నందుకు సంతోషమే కాని దుస్సాహసం చేస్తున్నానని సందేహిస్తున్నాను. సరే పురోగామిని నిరుత్సాహపర్చటం నాకభిమతం కాదు. త్వరలో నీవు మనశ్శాంతినైనా పొందలిగితే నేను తృప్తిపడగలను."

"మహా ప్రసాదం" అని నమస్కరించాను.

"రేపు ఉదయమే అనుష్ఠానము బోధిస్తాను. ఈ పూట గ్రంథస్థమైన నా ఉపన్యాసాలు చదువుదువు గాని. కోనేటి స్నానం చేసిరా..." అన్నారు స్వామీజీ.

సంతోషంతో స్నానం చేసి గబగబ కుటీరాన్ని సమీపిస్తుండగా స్వామీజీ మాటలు నాకు వినిపించాయి. "విశ్వం! ఇతడు మీకంటే త్వరలోనే నిగ్రహచిత్తుడు కావచ్చు. కాని ఏదో ఒకనాడు అంతటి నిగ్రహం కూడ నీటిబుడగలా వీగిపోతుంది. ప్రస్తుత స్థితికి అతని సంకల్పమే ఉత్తమమనిపిస్తోంది నాకు కూడా..."

ఆశ్రమంలోకి నడిచాను. స్వామీజీ పల్కులు సగం ప్రోత్సాహాన్ని, సగం సందేహాన్ని కలిగించాయి. అయినా, భావికాలంలో కూడ నా నిగ్రహశక్తినే దేదీప్యమానంగా వెలిగించాలని ధృఢచిత్తుడనయ్యాను. విశ్వం పొడిబట్టలు యిస్తే కట్టుకున్నాను. స్వామీజీ తన ఉపన్యాస గ్రంథాన్నిచ్చారు. ఆసక్తిగా చదువసాగాను. గీతను సోదాహరణంగా వివరిస్తూ చక్కనిశైలిలో ఉపన్యసించారు స్వామీజీ. నా మనస్సు తాదాత్మ్యం చెందినట్లే అయిపోయింది. మధ్యాహ్నం

రెండు గంటలకు కాబోలు స్వామీజీ పిల్చేవరకు అట్లాగే ఉండిపోయాను. "భోజనం చెయ్యి నాయనా! ఆ ధ్యాస కూడా మరచిపోగలిగిన నీ నిష్ఠ నాకు సంతోషం కలిగిస్తోంది" నేను చిన్నగా నవ్వటం తప్ప మాట్లాడలేదు. అప్పటికి కాని ఆకలి వేస్తోందని తెలియలేదు.

"ఇటురండి." అని విశ్వం బయటకు పిలిచాడు. అతన్ననుసరించాను. ఆ తోట ఆరెకరాల మేర వుంటుంది. ఐదు నిముషాల్లో వాయువ్య దిశగా వున్న ఒక పెద్ద కుటీరాన్ని చేరుకున్నాము. "రా బాబూ! వేళకు అన్నపానీయాలు లేకపోతే యోగసాధన యెట్లా చెయ్యగలుగుతావు?" అంది వృద్ధమాత నవ్వుతూ. ఆమె యోగిని అని చూడగానే అనుకున్నాను. నా వివరాలప్పుడే అందరికీ తెలిసినందుకు క్షణంపాటు సిగ్గుపడ్డాను.

ఆమె కేఖైయేళ్ళుంటాయి. ఎంతో ఆప్యాయతగా భోజనం పెట్టింది. పొన్నగంటికూర, పెసరపప్పు, సన్నబియ్యం అన్నం, గోధుమ రొట్టెలు, వెన్న.... ఈ సాత్విక ఆహారం గొడ్డు కారం అలవాటయిన నాకు రుచించకపోయినా ఇక పరిపాటి కావలసింది అదే కదా అని తిన్నాను. తర్వాత కుటీరానికి వచ్చేశాము. వారిలో యోగిని స్వామీజీ భార్యయేనని, ఇరవై ఏళ్ళ క్రితమే ఆ దంపతులిద్దరూ సన్యసించారని విశ్వం చెప్పాడు.

ఆ మరునాడు తెల్లవారుఝామున నాలుగంటలకే స్వామీజీ నన్ను మేల్కొల్పారు. యోగాసనాలు కొన్ని ఆచరించి చూపారు. ఇప్పట్లో నాకు దీక్షనిచ్చే ఉద్దేశ్యం వారికి లేదని తెలుసుకున్నాను ఏమైనా వారేది చెప్తే అది ఆచరించే తలంపుతో వున్నాను. అనుష్ఠానవిధం బోధించారు.

నాకు 'శివానంద్' అని స్వామి నామకరణం చేశారు. నాకు క్రొత్త జన్మ ఎత్తినట్లే వుంది.

క్రమంగా నేను యోగాభ్యాసానికలవడిపోయాను. ప్రతిరోజూ తెల్లవారుఝామున నాలుగు గంటల నుంచి తెల్లవార వచ్చేవరకు ఆసనాలు వేయటం... వెన్నతో ఒళ్ళంతా మర్దనా చేసుకొని వేడినీళ్ళతో తొట్టిస్నానం చేయడం, తర్వాత ఒక శేరు పాలు త్రాగటం అలవాటయిపోయింది. తర్వాత భగవత్ప్రార్థనతో రెండు గంటలు గడుపుతాను. అప్పుడు స్వామీజీతో కాని, వారి శిష్యులతో కాని తాత్వికచర్చ. పన్నెండింటికి భోజనం. ఒక గంట విశ్రాంతి. మరో రెండు గంటలు గడుపుతాను. అప్పుడు స్వామీజీతో కాని, వారి శిష్యులతో కాని తాత్వికచర్చ. పన్నెండింటికి భోజనం. ఒక గంట విశ్రాంతి. మరో రెండు గంటలు గ్రంథ పఠనం, లేకపోతే స్వామీజీ ఉపన్యాసాలు, బోధనలు మరికొన్ని గ్రంథస్థం చేస్తాను. నాలుగు నుంచి ఆరు గంటల వరకు విశ్వ వజ్రానందులతో తోటపని చేస్తాను. స్నానం చేసి ఒక గంట మౌనముద్ర వహిస్తాను. అప్పుడు మళ్ళీ ఫలహారం. తొమ్మిది గంటల వరకు ఎవరితోనో ఒకరితో చర్చ. మరో అరగంట ప్రార్థన చేసుకొని పడుకుంటాను.

ఇంచుమించు ఈ దినచర్యతో మూడు నెలలు నాకు తెలియకుండానే గడిచిపోయాయి. నా శరీరం ఎంత ధృఢంగా వుంటుందో, నాకప్పటికి కాని తెలియలేదు. మన:ఫలకంపై సులోచన రూపం అస్పష్టమైపోయింది. క్రమంగా శాంతిని పొందగలిగాను.

కాని, ఒంటరిగా ఉన్నప్పుడు స్వామీజీ తత్వగీతాలు పాడుకుంటూ ఉండేవాడిని. సులోచన నా దగ్గరికి రాకపూర్వం నేను సంగీత సాధన చేశానన్న విషయం నేనే మర్చిపోయాను. ఇప్పుడు నాకు తెలియకుండానే కంఠంలోంచి గానం ప్రవహించసాగింది. ఒకనాడు స్వామీజీ ఆ విషయం తెల్సుకొని గీతాపారాయణము, చర్చలు చేసే ముందు నన్ను దగ్గరకూర్చో పెట్టుకొని "శివా! నీ కమనీయకంఠంతో ఆ తత్వం పాడునాయనా!" అనేవారు. నాకాయన ఆజ్ఞ వెయ్యి యేనుగుల బలమిచ్చినట్లుండేది. నేను శ్లోకం పాడటం, తర్వాత వారు వ్యాఖ్యానం చేయటం దినచర్య అయిపోయింది. క్రమంగా నేనందరికీ తలలో నాలుక అయిపోయాను.

ఒకసారి ప్రక్కనే ఉన్న వూళ్ళో శ్రీరామ సప్తాహానికి స్వామీజీని ఆహ్వానించారు. మేము వెళ్ళాము. నాల్గవ రోజున మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు వారి ఉపన్యాసం జరిగింది. పూర్తిగా వేదాంత బోధ కాక మానసిక రోగాలను మాన్పుకునే విధానాన్ని వారు చక్కగా చెప్పారు. పరిచయస్తులు చాలామంది నా స్థితి చూసి ఆశ్చర్యపోయారు. ప్రశ్నల వర్షం కురిపించారు. నేను నవ్వి వూరుకున్నాను. ధౌతవస్త్రాలలో, పెరిగిన గడ్డంతో నేను కూడా యోగిలా కనిపిస్తున్నాను కాబోలు వారికి!

'రాత్రి ఏడుగంటలకి ప్రఖ్యాత నర్తకి సులోచన భరత నాట్యం ప్రదర్శిస్తారు' అని మైక్‌లో ఎవరో చెప్తుంటే కొన్ని క్షణాల పాటు నా తల తిరిగి పోయింది. నేను కంగారుగా స్వామీజీ ముఖంలోకి చూసి తలదించుకున్నాను. వెంటనే అక్కడ నిలబడలేక మా బసవైపు నడిచాను. వెనకాల విశ్వం పిలిచినట్లే అయినా వెనక్కు వెళ్ళాలనిపించలేదు. బసలో ఉన్నా అక్కడ కూడా ఏదో అశాంతి ఆవరించుకుంది. అక్కడికి దగ్గరలోనే ఉన్న కాలవలో స్నానం చేద్దామని వెళ్ళాను. దూరంగా దీపాల కాంతి కన్పిస్తోంది. స్నానం చేద్దామని వెళ్ళానే కాని రేవులో చీడీపై కూర్చుండిపోయాను. తిరిగి మనస్సు పాడైపోటానికే ఈ సప్తాహానికి వచ్చాననిపించింది. ఈ ప్రపంచంలోకి వస్తే నిగ్రహించుకునే శక్తి సడలిపోతోందని అప్పుడు కాని నాకు తెలియలేదు.

ఏదో ధమ్ముమని నీళ్ళలో పడిన చప్పుడైతే ఆలోచనల్లోంచి ఉలిక్కిపడి అటు చూశాను. ద్వాదశ చంద్రోదయం కానున్న ఆ వెలుగులో నాకు ఎవరో కాలవలో కురికినట్లే కనిపించింది. ఒక్కక్షణం ఆలోచించాను. ఎవరైనా స్నానం చేయడానికైతే ప్రక్కనే రేవు ఉండగా అక్కడ ఎందుకురుకుతారు? ఆ ఆలోచన రాగానే వెంటనే అంగవస్త్రం నడుముకు కట్టుకొని గబుక్కున నీళ్ళల్లో కురికాను. ఆ వ్యక్తి ఉరికినచోటుకి ఈది బుడింగిన మునిగాను. చేతికి బారెడు పొడుగున ఏదో దొరికింది. పట్టుకొనేసరికి బరువుగా ఉండటంతో నీటిపైకి తేల్చాను. ఆమె ఒక్క స్త్రీ. నా చేతిలో ఆమె జడ ఉంది. నా గుండెలెందుకో దడదడలాడాయి.

రెండుచేతులతోను ఎత్తుకొని రేవు వైపు నడిచాను. గట్టుపై పడుకోబెట్టాను. ఆమె స్పృహ కోల్పోయింది, ఇరవయ్యేళ్ళకు లోపే ఉంటాయి. ఇంతవరకు పరాయిస్త్రీని తాకి ఎరుగను. కాని, అపత్సమయం అని మనస్సు హెచ్చరించింది. వెంటనే పొట్టని గట్టిగానొక్కి మ్రింగిన

నీళ్ళన్నీ బయటకు రప్పించాను. ఆమెను మళ్ళీ ఎత్తుకొని బస చేరుకున్నాను. నన్ను చూసి స్వామీజీ, విశ్వం, వజ్రం తెల్లబోయారు. విశ్వం నాకు ఆసరా వచ్చాడు. ఇద్దరం ఆమెను చాపపై పడుకోపెట్టాము. ముగ్గురం కలిసి ఆమెకు ప్రథమ చికిత్స చేశాము. వజ్రం కుంపటితో నిప్పులు తెచ్చాడు. కాళ్ళు, చేతులు కాచాము. పావుగంట కామెకు స్పృహ వచ్చింది. మా ముఖాలు వికసించాయి... నన్ను స్వామీజీ ఏమీ ప్రశ్నించకపోవటం నాకు ఆశ్చర్యం కలిగించింది.

ఆమె కళ్ళు తెరుస్తూనే మమ్మల్ని చూసి తెల్లబోయి పైకి లేచింది. "ఈ మధుపర్కం కట్టుకురామ్మా! తర్వాత మాట్లాడదాం!" అని స్వామీజీ పొడి వస్త్రం ఇచ్చారు. ఆమె హరితేక్షణయై ప్రక్కగదిలోకి వెళ్ళి కట్టుకుని ఐదు నిముషాల్లో వచ్చింది. జుట్టు ఆరవిప్పుకుంది.

"నీవెందుకు నీళ్ళల్లో పడ్డావమ్మా!" అని అడిగారు స్వామీజీ. అదే వారి ఉపజ్ఞ!

ఆమె తలవంచుకుంది. కనులలో నీరుబకడం నేను గుర్తించాను. "నేను నిర్భాగ్యురాల్ని స్వామీ! జీవితంపై రోత పుట్టింది."

"ఎంత పిచ్చిదానవమ్మా! ప్రాణాలు తీసుకునే హక్కు మానవులకిలేదు. కష్టాలకు భయపడి ఆత్మహత్య చేసుకోవడం అవివేకం. ఇంతకీ నీకు వచ్చిన కష్టమేమిటో చెప్పు. నీకు అన్ని విధాల నేను సహాయం చేస్తాను." అన్నారు స్వామీజీ.

ఒక్క క్షణం తటపటాయించి "నేను ఒక అనాథని. చిన్నతనంలో నా తల్లి పతిత అయిన చిహ్నంగా నేను జన్మించాను. ఇంతవరకు నా తల్లిగా నేను ఆరాధించిన స్త్రీ ఒక వేశ్య అని నాకు కొన్నాళ్ళ క్రితమే తెల్సింది. నన్ను ఆ వేశ్య ఇంత వరకు పెంచి పెద్ద చేసినది ఆ నీచ వృత్తిలోకి దించటానికే... కాని, నేనందుకంగీకరించలేదు. అందుకు నన్ను నరకయాతనలకి గురి చేసింది. అయినా, నేను లొంగలేదు. ఈ రాత్రి లొంగినట్లు నమ్మించి ఇల్లు వదలి పారిపోయి వస్తూ దారిలో కాలవలో కురికాను. నన్ను కాపాడండి. నాకు ముక్తిమార్గం చూపించండి. నా అదృష్టం కొద్దీ నన్ను మీరు రక్షించారు" అంది ఆమె.

"నిన్ను కాపాడినవాడు మా శివానందుడు..." అని నా వైపు చూపారు స్వామీజీ. ఆమె నావైపు కృతజ్ఞతతో చూసింది. నా ఒళ్ళు గగుర్పొడిచింది.

స్వామీజీ ఒక్క నిముషం ఆలోచించి, "వజ్రం! వెంటనే పట్నానికి బండి సిద్ధం చేయించు" అన్నారు.

వారి ఆజ్ఞ అయినదే తడవు అతడు తన విధి నెరవేర్చుకున్నాడు. 'శివా! నువ్వీమెను తీసుకొని ఆశ్రమానికి వెళ్ళిపో!" అన్నారు. నాకాయన మాటలు ఆశ్చర్యం కల్గించాయి. అయినా, ఎందుకూ అన్న ప్రశ్న వేసే అలవాటు తప్పిపోయింది. ఐదు నిముషాల్లో ఆమె, నేను ఒంటెద్దు బండిలో బయలుదేరాము. ఒక నిండుప్రాణాన్ని రక్షించగల్గానన్న తృప్తి నాకు హాయిని చేకూర్చింది. మనస్సు ప్రశాంతత వహించింది. నేనామెను పలకరించలేదు. రాత్రి పదిన్నరకి పట్నంలో ఆశ్రమాన్ని చేరుకున్నాము. వృద్ధమాత కామెనప్పగించి పాలు త్రాగి

పడకున్నాను. మరునాడు ఉదయం ఐదు గంటలకి కాని మెలకువ రాలేదు. దినకృత్యంలో ప్రథమభాగం పూర్తయ్యే సరికి సూర్యుడు బారెడు ప్రొద్దెక్కాడు. అప్పుడే స్వామీజీ విశ్వ వజ్రానందులతో వచ్చారు.

నేను పాలు త్రాగుదామని కుటీరానికి వెళ్ళాను. పంచలో కూర్చొని ఆమె పూలమాల గుచ్ఛుతోంది. కణ్వమహర్షి ఆశ్రమజ్యోతి శకుంతల యేమో ననిపించింది నాకు. మనస్సు నిముషం పాటు చలించకపోలేదు. ఆమె చిన్నగా నవ్వింది. ఆ నవ్వును అర్థం చేసుకోటానికి నేను ప్రయత్నించలేదు. కళ్ళు మూసుకొని నిగ్రహాన్ని తెచ్చుకున్నాను. లోపలికి వెళ్ళి మాత నడిగి పాలు త్రాగాను. తిన్నగా కుటీరాన్ని చేరుకున్నాను. వృద్ధమాత వెనకాల పిల్చిన పిలుపును బట్టి ఆమె పేరు గౌరి అని తెల్సుకున్నాను.

"శివానంద్! రాత్రి వీవటు వెళ్ళగానే సులోచన నాట్యమైన తర్వాత స్వామీజీని కలుసు కుంది. ఆమె ఇప్పుడు పశ్చాత్తాపపడుతోంది. స్వామి మాటలు నిజమయ్యాయి. ఆమెకిప్పుడు నీ త్యాగం అర్థమయింది. అది మాత్రం నిజం. వస్తువు దూరమయ్యాక కాని దాని విలువ తెలియదు" అన్నాడు విశ్వం.

"దయ యుంచి ఆమె విషయాలు నా వద్ద చెప్పకు" అని అక్కడ ఉంచి గ్రంథ పఠనానికి వెళ్ళిపోయాను. సులోచన తాలూకు వాద్యగాండ్రంతా నాకు పరిచయస్తులే. వాళ్లల్లో ఎవరో నన్ను చూసి సులోచనకు నా ఉనికిని తెలియపర్చి వుంటారు. ఇప్పుడిప్పుడే ఆమె మనస్సు పరితాపం చెందటం నాకొక విధంగా సంతోషం కలిగించినా తీవ్ర వ్యథ కలిగింది ఆమె తలంపువల్ల. క్రమంగా స్త్రీ ప్రసక్తే మర్చిపోవాలని ప్రయత్నం చేయసాగాను.

రోజులు దొర్లిపోతున్నాయి. దినకృత్యం యధాతథంగానే వుంది. కొన్నాళ్ళ వరకు అందులోని మార్పు నాకు తెలియలేదు. నాకేవస్తువు కావలసినా, నాకు భోజన పదార్థాలు సిద్ధం చేయవల్సినా గౌరియే చేసేది. స్వామీజీ బోధనలు వినేటప్పుడు, పూజలోను ఆమెకూడా అనుసరించటం వల్ల నేను సోదర శిష్యులతో సమంగానే ఆమెను పరిగణిస్తూ వచ్చాను. కాని, నాకు ప్రత్యేకంగా సేవ చేయడం నాకాశ్చర్యం కలిగించింది. అప్పటికీ ఒక రోజున ఆమె నట్లా చెయ్యవద్దంటే "స్వామీజీ ఆజ్ఞ నేను మాత్రం నిర్వర్తించవద్దా? యోగుల సేవ చేయటంతోనైనా నా జన్మ చరితార్థత నొందాలనుకుంటున్నాను. మీ రనుగ్రహించండి." అంది. నేను మ్రాన్పడిపోయాను.

స్వామీజీ నన్ను పరీక్షిస్తున్నారో, లేక యోగ సాధన నుంచి నన్ను మరల్చటానికి ఆటంక పెడుతూన్నరో నాకర్థం కాలేదు. అయినా అదీ నా మేలుకేననిపించింది. నా నిగ్రహశక్తి మరింత పటిష్టం కాగలదు. వారు దీక్ష నివ్వకపోయినా కఠినదీక్షను నాకు నేనే ఇచ్చుకోవాలనుకున్నాను. కాని, తక్షణం సౌందర్యలతికలా మెరిసిపోతూ నా ఎదుట చరించే గౌరి నామనస్సు నుద్రేకపర్చటం నాకు సంకటప్రాయమైంది. ఆ పరిస్థితి నధిగమించుదామని ఎక్కువగా భగవత్ప్రార్థనలో గడపసాగాను. మండుటెండలో కొన్ని గంటల సేపు రాతిమీద

కూర్చుని ఓంకారాన్ని జపిస్తూ ఉండేవాడిని. మొదట్లో కాళ్ళు కాలి బొబ్బలెక్కినా శరీరం బండబారిపోయింది. కొన్ని రాత్రిళ్ళు తీవ్రంగా వర్షం కురిస్తే ఆ గాలివానలోనే కొన్ని గంటల సేపు ఉండిపోయేవాడిని. ఒకనాటి రాత్రి నేనట్లా వర్షంలో ఒక గంటసేపు అధికంగా ఉన్నాను. చలివల్ల ఈతిబాధ మనస్సు కంటలేదు. కాని, శరీరం భరించలేదుగా! మరునాడుదయం ఒళ్ళంతా నొప్పులతో పేలిపోయే జ్వరం వచ్చేసింది. నాకు రెండు రోజుల దాకా తెలివి లేదని మూడో నాడుదయం వృద్ధమాత, గౌరి, విశ్వం, వజ్రం స్వామీజీ అంతా నా మంచం చుట్టూ ఉన్నప్పుడు స్వామీజీ నోటి వెంట వినేవరకు నాకు తెలియలేదు.

నేనా జ్వరం నుంచి తేరుకోటానికి సరిగ్గా ఇరవై రెండు రోజులు పట్టింది. ఇన్ని రోజులూ గౌరి నన్ను కంటికి రెప్పలా కాపాడి సేవ చేసింది. నేను తిరిగి పూర్వస్థితికి వచ్చేశానేమోనని పించింది. ఆమెపై అనురాగ భావాలు మనస్సును చుట్టివేశాయి. మొదట్లో అవి కృతజ్ఞతతో కూడుకున్నవే కాని తర్వాత అనామకురాలైన ఒక యువతీహృదయం తోటి ప్రాణికోసం అహర్నిశలూ పాటుపడుతోందే అన్నభావం మనస్సును ఆర్ద్రతతో నింపేసింది. అయినా, ఆమె చూపుల నుంచి తప్పించుకొని ధ్యానముద్రలో పడిపోయే వాడిని.

ఆ వేళ్టికి పూర్తిగా ఆరోగ్య వంతుడనయ్యాను. సాయంత్రం స్వామీజీ నన్ను తోటలోకి తీసుకువెళ్ళి. “నాయనా! నీవు శరీరాని కధిక పరిశ్రమ ఇవ్వటం వల్ల మనో నిగ్రహాన్ని సంపాదించలేవు. మరి దీక్షకు సిద్ధంగా ఉన్నావా?” అన్నారు.

“తమ ఆశీర్వాదం వల్ల ఆ అదృష్టం దక్కాలనే కోరుతున్నాను.” అన్నాను ఆనందంగా. కాని, వారి పెదవుల మాటున చిరుహాసం నన్ను సందిగ్ధంలో పెట్టింది.

“సరే ముందు వ్యక్తిత్వం వ్యామోహం తగ్గి మనస్సు మీదనే దీక్ష పనిచేయాలంటే నీవన్ని ఈతిబాధలకు అతీతుడవు కావాలి. నేను చెప్పిన పని అల్లా చెయ్యగలవా?”

“ఆ ప్రశ్న నాకు ప్రత్యేకించవద్దు” అన్నాను చిరుహాసంతో.

తత్ఫలితంగా వారి నూతన శిష్యులతో నేను క్రొత్తరకం జీవితానికి పాల్పడవల్సి వచ్చింది. స్వామీజీ పంపినచోటుకల్లా వెళ్ళాము. ఒక ఊరిలో తీవ్రంగా కలరావ్యాధి ప్రబలి వుంది. అనాధులైన వారికి సేవ చేయడానికి వెళ్ళాము. వారి మల మూత్రాలు ఎత్తాము. ఒక కుష్టురోగుల చికిత్సాలయంలో పది రోజులుండమని స్వామీజీ ఆజ్ఞాపించారు. అప్పటికే మానవసేవా తత్పరులమై అందులోని ఆనందాన్ని చవిచూస్తున్న మాకు ఏహ్యమనే వస్తువు ఈ ప్రపంచంలో లేదనిపించింది. అరిషడ్వర్గాలను జయించటానికే స్వామీజీ మమ్మల్నిట్లా పరీక్షిస్తున్నారని మాకు తెలుసు. మనోవాక్కాయకర్మలా అట్లే ఆచరించాము. మరో పది రోజులు ఒక పిచ్చాసుపత్రిలో గడిపాము. ఇట్లాదేశాటన చేస్తూ మూడునెలలకి ఆశ్రమాన్ని చేరుకున్నాము. స్వామీజీ ఆనందం వర్ణనాతీతమైంది. మాకూ తృప్తి కలిగింది.

ఒకరోజున స్వామీజీ మమ్మల్ని పిల్చి పట్నంలో భిక్షాటనకి వెళ్ళమన్నారు. ఆ పని మాకు ఏహ్యమనిపించలేదు అయినా పంచమలు ఎక్కువగా లేని వైపుకే బిచ్చాటన కెళ్ళటానికి

మనస్సు మొదటి రోజున లొంగిపోయింది. కాని, మరునాడు ఆ స్థితిని కూడ అధిగమించ గలిగాను. కొందరు ప్రశ్నలు వేసినా "జీవితాన్వేషణ అనేది మానవధర్మం. అందులో నాకు కనపడిన సుగమ్యమైన దీమార్గమే" అని మాత్రం అన్నాను. తత్వాలు పాడుకుంటూ భిక్షాటన చేశాను. పదిహేను రోజులట్లా గడిచిపోయాయి. రోజూ రెండు మూడు కుంచాల బియ్యం వచ్చేవి. ఆ వేళ ఇక ఆ పని మానివెయ్యమన్నారు స్వామీజీ. రేపే దీక్ష నిస్తానన్నారు. నాకు చాలా ఆనందమైంది. క్రమంగా ఆత్మసంయమయోగాన్ని సాధించాలని దృఢచిత్తుడనయ్యాను. స్నానం చేసి సంధ్యావందనం ముగించుకొని, ఒక గంటసేపు మౌనముద్రలో ఓంకారాన్ని జపించాను. భోజనం చేయటానికి కుటీరాన్ని చేరుకున్నాను. గుమ్మంలో నాకోసమే ఎదురుచూస్తున్నట్లుగా నిలబడి వుంది గౌరి. ఆమె ముఖంలో జ్యోత్స్న తళుక్కుమంటోంది. మౌనంగా భోజనశాలలోకి వెళ్ళి కూర్చున్నాను. అరటియాకులో భోజనం వడ్డిస్తోంది గౌరి. ప్రతి రోజు మాతయే అన్నం పెట్టేది. కాని ఆమె కీవేళ ఆరోగ్యం సరిగా లేదని మధ్యాహ్నమే తెలుసుకున్నాను. మాటిమాటికీ అది వడ్డించనా, ఇది వడ్డించనా అని గౌరి అడిగేది. వద్దని చేతితో సంజ్ఞ చేశానే తప్ప పలుకాడలేదు. భోజనం వేళ మౌనం పాటించటం నాకలవాటై పోయింది. తల వంచుకొని భోజనం ముగించుకుని తిన్నగా బయటకు నడిచాను.

దారిలో కోనేటి ప్రక్కనుంచి వస్తుంటే పౌర్ణమిచంద్రుని వెన్నెల వెలుగులో కలువలు విచ్చుకొని తళతళలాడడం చూచాను. తోటలో ప్రతిదీ నవచైతన్యంతో వెలిగిపోతోంది. నా మనస్సుని ఏదో మైకం క్రమ్మినట్లయింది. ఒకరాతి బండపై చతికిలబడ్డాను. చంద్రుని వైపు చూస్తూ వెనకనున్న రాతికి జార్లగిలబడ్డాను. అకస్మాత్తుగా చంద్రబింబంలో గౌరిముఖం కనిపించింది. వెంటనే ఆ బింబం సులోచనదిగా మారిపోయింది. ఆ అనుభూతి క్షణం మాత్రమే! ఉలిక్కిపడి తెలివి తెచ్చుకున్నాను. మళ్ళీ మనస్సు చలించకుండా కళ్ళు మూసుకుని ధ్యానముద్రలో వుండిపోయాను.

అట్లా ఎంతసేపున్నానో తెలియదు కాని వర్షపు చినుకులు పాదముల మీద పడినట్లయి తెలివి తెచ్చుకున్నాను. నా పాదాల వద్ద అవనతశిరస్కయై ఉన్న గౌరిని చూసే సరికులిక్కి పడ్డాను. నాలో కంగారు ఎక్కువయింది.

"గౌరీ!" అంతవరకు ఆమెనెప్పుడూ నేను పేరు పెట్టి పిలిచి ఎరుగను. అసలు మాట్లాడడమే తక్కువ. ఆ పిలుపు నానుండి రావటంతో ఏదో శక్తి క్షీణించి గగుర్పాటు అధికమైంది. ఆమె తల ఎత్తి నా వైపు చూసింది. ఆమె చెక్కిళ్ళపై కన్నీటిధారలు స్పష్టంగా కనిపించాయి! నా మనస్సు వికలమైపోయింది. ఏదో ఓడిపోతున్నట్లనిపించింది. మనస్సులో ఏదో అపశ్రుతి గొంతెత్తి పలుకుతున్నట్లనిపించింది. అక్కడ నిలబడలేకపోయాను. పక్క మీద కూర్చున్నాను. అయినా మనస్సు గౌరి బాధను తెలుసుకోందే వచ్చేశానని నిందిస్తోంది. ఆత్మ నిగ్రహశక్తిని కోల్పోతావా అని హెచ్చరిస్తోంది. 'నిగ్రహానుగ్రహాతీతమైన శక్తి సాధించిన వారికి తప్ప అన్యులకు కాదు యోగసాధన' అన్నస్వామీజీ హెచ్చరిక అంతరాలలో వినిపించింది. ఉద్రేకాన్ని

భరించలేకపోయాను. గబగబా దీపజ్వాలపై నా రెండు అరచేతులు పెట్టి కళ్ళు మూసుకున్నాను. భగ్గున మండిపోయాయి చేతులు. మరుక్షణంలో ఏమయ్యేదో ఊహించలేను కాని. "శివా! శివా!" అన్న స్వామీజీ గంభీర కంఠధ్వని గట్టిగా వినిపించటంతో చేతులు జ్యోతి నుంచి వేరు చేశాను. అప్పుడు శరీరం వణకనారంభించింది. చేతులు జ్వాలపై ఉన్నప్పటి కంటే మరీ మండిపోతున్నాయి. చేతులు రెండూ పుళ్ళు పడిపోయాయి. స్వామీజీ ఏదో పసరు తెచ్చి చేతులపై పోశారు. మరీ మంట ఎక్కువైంది. నాకళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. గుండెలు బరువెక్కిపోయాయి.

"శివా! ఎంత పనిచేశావు నాయనా! మనస్సు చలించినందుకు దానికి వెయ్యవలసిన శిక్ష శరీరానికి వెయ్యటం ఉచితమేనా? ఇన్నాళ్ళ నుంచి నీకు చెప్పలేదు. నీ నిష్ఠను పాడు చేయటం ఇష్టం లేక. నీవిక్కడికి వచ్చి అప్పుడే పదకొండు మాసాలయింది. నిన్ను దూరం చేసుకున్నాక సులోచన పశ్చాత్తాపపడం నాకు తెలుసు. ఐదు నెలలప్పుడు ఒక ప్రదర్శనకి వెడుతూండగా కారు ప్రమాదంలో సులోచన భర్త మరణించాడు. ఆమె కుడికాలు విరిగిపోయింది. ఆమె అన్ని విధాలా దురదృష్టవంతురాలైంది. నీవు ఆ మధ్య కుష్ఠురోగుల చికిత్సాలయానికి వెళ్ళినప్పుడు రెండుసార్లు ఇక్కడికి వచ్చింది. వెంటనే ఆమె దగ్గరకు వెళ్ళునాయనా! ఆమె నెలలు నిండిన గర్భవతి. నీకోసం ఎదురుచూస్తోంది. సాయంత్రం కబురు వచ్చింది కూడా!" అన్నారు స్వామీజీ.

అప్పటికే నాకళ్ళు వరదలై పారుతున్నాయి. దుఃఖం ముంచుకువస్తోంది. బరువు తీరేవరకు ఏడ్చాను. నాచేతుల విషయం మర్చేపోయాను. విశ్వం నాకు సాయం రాగా సులోచన దగ్గరకి పరుగుతీశాను...ఒక పావుగంటలో ఆ భవంతి చేరుకున్నాను. అప్పుడు రాత్రి పదకొండయి వుంటుంది. క్రితంసారి నేనా ఇంటికి వెళ్లింది అదే సమయానికి. మనస్సు పూర్తిగా కల్లోలితమైపోయి అడుగులు బరువుగా పడసాగాయి. వాకిట్లో దీనముఖంతో వున్న ఆనాటి దాసీది నన్ను క్షణంలో గుర్తుపట్టి, "వచ్చారా బాబూ! అమ్మగారు పురిటినొప్పులతో బాధ పడుతున్నారని ఆపరేషన్ చేస్తే గాని లాభం లేదని హాస్పిటలు కింతకుముందే తీసుకువెళ్ళారు" అంది. ఆయోమయంగా పిచ్చిగా బయటకు పరిగెత్తాను.

రోడ్డు మీద అడ్డదిడ్డంగా నడుస్తుంటే విశ్వం నా చెయ్యి పట్టుకొని నడవసాగాడు. నేను పూర్తిగా అచేతన స్థితిలో ఉన్నాననే చెప్పాలి. మేము హాస్పిటలుకు చేరుకున్న ఐదు నిముషాలకు ఆపరేషన్ అయిందని మొగపిల్లవాడు పుట్టాడని నర్సు చెప్పేసరికి కొంత తేరుకున్నాను.

అరగంటకి డాక్టరు సులోచనను చూడటానికి మా కనుమతి ఇచ్చారు. ఆమెను చూడగానే ఇద్దరకూ కన్నీటి ప్రవాహంతో మాటలు స్తంభించిపోయాయి.

"బావా! నన్ను క్షమించావా? నిన్ను కాలదన్నుకున్న ఈ పాపి కింతకంటే ఏం శిక్ష కావాలి?.... తుది ఘడియల్లో నిన్ను చూడలేక పోయానన్న బాధ లేకుండా పోతున్నందుకు నాకిప్పుడెంతో ఆనందంగా ఉంది. నీ జీవితం ధారపోసి పెంచిన ఈ పుష్పలత స్వార్థం వల్ల

ఎంత అధోగతి పాలైందో చూశావా? అటువంటి శిక్ష ఈ పసిగుడ్డుకు పడకూడదని నిన్ను అర్థిస్తున్నాను. నా కామాట ఇస్తే హాయిగా మరణిస్తాను..." అంది సులోచన.

చిన్ననాటి ఆమె పిలుపు నా మనస్సుని మరింత వశం చేసుకుంది. "సులోచనా! నువ్వు చావటానికి వీల్లేదు. నేను నీ తిరస్కృతి వల్ల నిన్ను ద్వేషించినా నిన్ను తప్ప ఎవ్వర్నీ ఇంతవరకు ప్రేమదేవతగా ఆరాధించలేదు."

ఎన్నో మాట్లాడాను. భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థించాను. ఎన్ని చేసినా సులోచన దక్కలేదు. నాకు తెలివి తప్పిపోయింది. తెలివి తెచ్చుకునే సరికి తెల తెలవారుతోంది. అప్పటికి కాని ఆశ్రమానికి నన్ను తీసుకువచ్చారని తెలియలేదు. స్వామీజీ ఒక్కరే నా ప్రక్కన ఉన్నారు.

గబుక్కున పైకి లేచాను. "స్వామీ! సులోచన..." ఆ పైన నా నోటి నుంచి మాటలు రాలేదు. "నీ హృదయంలో ఆమె స్మృతి. ఆమె రూపం ధరించిన పసిబిడ్డ తప్ప ఆమె ఇక లేదు. సులోచన అంతటి ఉన్నతస్థితికి రావటం నీ వల్లనే! ఆమె తదుపరి భ్రష్టత వేరే విషయం. ఇప్పుడు నీపై ఆ పసిబిడ్డ ఆధారపడి వున్నాడు. నువ్వు నీ ప్రేమ పుంజాన్ని ఆ బిడ్డపై ప్రసరించవలసి వచ్చింది. శివా! నువ్వు బాధ్యతాయుతమైన జీవితాన్నుంచి పారిపోదామని యత్నించావు. ప్రత్యక్ష పరోక్షాలుగా అది నిన్ను వెంటాడుతూనే వుంది. గౌరి నీ వల్ల రక్షింపబడటమే కాకుండా అందుకు కృతజ్ఞతగా నీకహర్నిశలూ సేవ చేస్తూ మనస్సు కూడా అర్పించింది. యోగసాధనా నిమగ్నుడవై మనస్సు నిగ్రహించుకోనూ లేక, బాధ్యతాయుత జీవితాన్ననుభవించనూ లేక నలిగిపోయావు. ఒకరి కానందం కలిగిస్తు నీవానందిస్తు పురుషార్థ సాధన చేయడంలోగల తృప్తి ఈ కఠిన యోగనిష్టలో కలుగదు. ఇప్పుడు నీవా అనాథ హృదయాలలో ప్రేమామృతాన్ని నింపవల్సి వుంది. మాతృ విహీనుడైన ఆ బిడ్డను తన పొత్తిళ్ళలోకి తీసుకొంది గౌరి. ఆమె నీకంటే నిగ్రహవంతురాలు. నీ నిష్టను భంగపరచలేక నీపై నుంచి మనస్సును త్రిప్పుకోలేక ఎంతో బాధపడింది. నీలో సంపూర్ణ మానవత్వం మేల్కొనవలసిన సమయం వచ్చింది. జీవితం జీవించటానికే అన్న సత్యం వంటిదే. ఒకరి హృదయంలో స్థానం సంపాదించినందుకు వారికి హృదయమర్పించడం కూడ మానవత్వమన్న సత్యమూను. నీ జిజ్ఞాసవల్ల ఈ సత్యం తెలుసుకుంటే ధన్యుడవౌతావు" అన్నారు స్వామీజీ నా ఒళ్ళు నిమురుతూ.

అంతవరకు వారు నన్నెప్పుడు తాకి ఎరుగరు. వారి స్పర్శతో నాలో ఏదో శక్తి ఉత్పన్నమైనట్లయింది. వారి తేజోమయ నేత్రాల నవలోకించేసరికి ఏదో ఉన్నత భావానుభూతి కలిగినట్లయింది. "తమ ఆజ్ఞ శిరసా వహిస్తాను. స్వామీ! నాకో ప్రగతిపథం చూపారు" అన్నాను. ఆనందభాష్పాలతో గౌరిని కల్సుకుందామని వృద్ధమాత కుటీరం వైపు వడివడిగా అడుగులు వేశాను.

•